సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 22 । మార్చి । 2024



ఎరువుల లెక్క పక్కా

ఎరువుల తనిఖీ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిల్వల్లో తేడాలు రాకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. 8లో▸



వేలం పాటపై సందిగ్ధం!

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మాల్ పశువుల సంత నిర్వహణ వేలం పాటపై సందిగ్ధం కొనసాగుతోంది. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సాయంత్రం 6:33

సహర్ : శనివారం ఉదయం 4:56

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన 'చల్లా'



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఇచ్చిన పదవికి పూర్తి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో చల్లా సహా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ చల్లా కవిత, కార్పొరేటర్ సిద్దాల మౌనిక, చల్లా శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మేయర్ దంపతుల భేటీ

బడంగ్‌పేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సీఎంను ఘనంగా సన్మానించి టైగర్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అభివృద్ధికి సహకారించాలని కోరారు.

ట్రస్మాను బలోపేతం చేయాలి



రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులకు అభినందన

మీర్‌పేట: తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా)ను మరింత బలోపేతం చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిద్దాల బీరప్ప పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీకి జిల్లా తరఫున ఎన్నికైన సభ్యులకు గురువారం కార్పొరేషన్ గాయత్రీనగర్‌లోని మెగాసిటీ గ్రామర్ స్కూల్‌లో అభినందన సభ, ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర సలహాదారులుగా కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, తల్లోజు వెంకటయ్య ఆచారి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బోళ్ల శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కేవీఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడిగా డీవీఎస్ స్వామి, జాయింట్ సెక్రటరీగా కదారి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా అక్కెం కృష్ణయాదవ్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ చేసే సూచనలు, కార్యక్రమాలను జిల్లా సభ్యులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, జిల్లా నుంచి అధిక ప్రాధాన్యత ఉండేలా కృషి చేయాలని సూచించారు.

'పేరిణి పంచాంగములు, పరిణామక్రమం' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు

కందుకూరు: మండలంలోని చిప్పలపల్లి పరిధిలోని విద్యారణ్యం వేద పాఠశాలలో గురువారం స్వర్గీయ గురు పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ గారి 101వ జయంతి ఉత్సవాలను విద్యార్థులు వేద పారాయణం మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ పేరిణికుమార్ పరిశోధించి రాసిన 'పేరిణి పంచాంగములు, పరిణామక్రమం' పుస్తకాన్ని ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, కవి పండితుడు ఇరుగంటి వెంకటరమణ, డాక్టర్ రమేష్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నటరాజ రామకృష్ణ తెలుగు నేలకు అందించిన సేవలను కొనియాడారు. ఆయన తన జీవితాన్ని ఆంధ్ర నాట్యం, పేరిణి శివతాండవాల ప్రచారానికి ధారపోసిన మహనీయుడన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ డాక్టర్ పేరిణికుమార్ ఈ నృత్యాన్ని నృత్యజ్యోతి నాట్య శిక్షణాలయం ద్వారా ఎంతో మంది విద్యార్థులకు నేర్పిస్తూ కళను కొనసాగించడం హర్షించదగ్గ విషయమన్నారు. పేరిణి గురించిన విషయ పరిజ్ఞానం భావితరాలకు అందించే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని ముద్రించి ఆవిష్కరించినట్లు పేరిణికుమార్ తెలిపారు. అంతకు ముందు వేదారణ్యం వ్యవస్థాపకుడు మాడుగుల శశిభూషణం సోమయాజి అతిథులను ఘనంగా సన్మానించారు.

ఫంక్షన్.. టెన్షన్

శుభకార్యాలపై 'కోడ్' ఎఫెక్ట్

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆంక్షలు
- ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
- రూ.50 వేల నగదుకు మించితే సీజ్
- ఐటీకి భయపడి ఆన్‌లైన్ చెల్లింపులు అంగీకరించని వ్యాపారులు
- బంగారం, పెళ్లి బట్టలు, ఇతర సామగ్రి కొనేందుకు తప్పని తిప్పలు



సరూర్‌నగర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

హుడాకాంప్లెక్స్: శుభకార్యాలపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పడింది. ప్రస్తుతం శుభ ఘడియలు నడుస్తున్నాయి. ఏప్రిల్ 26 వరకు సుముహూర్తాలు ఉండడంతో అనేక మంది తమ పిల్లలకు సంబంధాలు కుదుర్చుకుని, వెంటనే పెళ్లిళ్లు కూడా చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటు అబ్బాయి, అటు అమ్మాయి తల్లిదండ్రులు కట్నకానుకలు సమర్పించుకుంటున్నారు. ఇరువైపులా పెద్ద ఎత్తున షాపింగ్ చేయడం.. విందు భోజనాలకు అవసరమైన నిత్యవసరాల కొనుగోలుతో పాటు ఫంక్షన్ హాళ్ల బుకింగ్.. పెళ్లి బట్టలు.. బంగారు ఆభరణాలు, ఫర్నిచర్, వంట సామగ్రి, వాహనాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. అక్కడే అసలు చిక్కు వచ్చి పడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం.. రూ.50 వేల నగదుకు మించి వెంట తీసుకెళ్తే తనిఖీల్లో భాగంగా పోలీసులు వాటిని సీజ్ చేస్తుండటంతో ఇబ్బందిగా మారింది.

ఆన్‌లైన్‌కు నిరాకరణ

ఆన్‌లైన్ చెల్లింపులపై ఐటీ ఆంక్షలు కొనసాగుతుండటంతో మెజార్టీ వ్యాపారులు ఇప్పటికీ వైట్ కంటే, బ్లాక్‌లో చెల్లింపులకే ఆసక్తి చూపుతున్నారు. ఆన్‌లైన్ చెల్లింపులపై సీఎస్‌టీ, జీఎస్‌టీలు ఉండ డమే ఇందుకు కారణం. ముఖ్యంగా బంగారం వ్యాపారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, కేటరింగ్ సంస్థలు, హోటళ్లు, వంట మనుషులు.. చెక్కులు, ఆన్‌లైన్ నగదు చెల్లింపులను స్వీకరించడం లేదు. వీరంతా ఐటీ చూపించడం ఇష్టం లేకే ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. దీంతో పెద్దపెద్ద వాటికే కాదు.. చిన్నచిన్న అవసరాలకు సైతం నగదుపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రతిదానికి పెళ్లి కార్డు, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు వెంట తీసుకెళ్లాల్సి వస్తోంది. లేదంటే ఎక్కడ పోలీసులు సీజ్ చేస్తారోనన్న భయం వెంటాడుతోంది.

ఆస్తులు కుదువ పెట్టినా పుట్టని అప్పు

ఇదిలా ఉంటే ఇంట్లో శుభ కార్యాలకు పెద్ద ఎత్తున నగదు అవసరమవుతోంది. ఆశించిన స్థాయిలో ఇంట్లో నగదు లేకపోవడం, బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై ఆంక్షలు కొనసాగుతుండడంతో అవసరానికి స్థిరాస్తులు కుదువ పెట్టినా మార్కెట్లో అప్పు పుట్టడం లేదు. అంతేకాదు బ్యాంకుల నుంచి రూ.10 లక్షలకు మించి నగదు డ్రా చేస్తే వెంటనే ఐటీ అధికారులు రంగంలోకి దిగిపోతుండటం ఆందోళనకు గురి చేస్తోంది. కేవలం శుభకార్యాలు చేసే వారికే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు వెళ్లే రోగులకు సైతం ఆంక్షలు ఇబ్బందిగా మారాయి. అప్పు ఇచ్చి పుచ్చుకునే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

ఆన్‌లైన్ అంటే కష్టమే..

ప్రతి ఫంక్షన్ హాల్లో 20 నుంచి 30 మంది వర్కర్లు పని చేస్తుంటారు. వీరికి నగదు రూపంలో కూలీ చెల్లించాల్సి వస్తుంది. పూలు, పండ్లు, కూరగాయలు అమ్మే రైతులకు నగదు చెల్లించాల్సి ఉంటుంది. వీటికి ఐటీ చూపించలేం. అన్నింటికీ ఆన్‌లైన్ చెల్లింపులంటే ఐటీ చూపించలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

– సుధాకర్, ఫంక్షన్‌హాల్ నిర్వాహకుడు

పెళ్లికి మినహాయింపు ఇవ్వాలి

ఈ నెల 28న మా అమ్మాయి పెళ్లి ఉంది. బట్టలు, బంగారం తీసుకోవాలంటే నగదు లభించడం లేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో రూ.50 వేలకు మించి వెంట తీసుకెళ్తే తనిఖీల్లో పోలీసులు సీజ్ చేస్తున్నారు. బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లపై కూడా ఆంక్షలు ఉన్నాయి. పెళ్లి పత్రిక ఉంటే రెండు లక్షల వరకు మినహాయింపు ఇవ్వాలి.

– ఎం.శ్రీనివాస్ రెడ్డి, సరూర్‌నగర్

సరైన ఆధారాలుండాలి



ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎన్నికల కమిషన్ నగదు, వస్తు, మద్యం తరలింపుపై ఆంక్షలు విధించింది. శుభకార్యాల వేళ నగదు వెంట తీసుకెళ్లే వారు ఇబ్బంది పడుతుంటారు. వీరు తమ వెంట పెళ్లి కార్డులు, సదరు నగదు ఏ బ్యాంకు అకౌంట్ నుంచి డ్రా చేశారు? ఎంత డ్రా చేశారు? ఏం కొనుగోలు చేయబోతున్నారు? వంటి వాటికి ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఆస్పత్రులకు వెళ్లేవారు పేషంట్ కేషీట్‌లు వెంట తీసుకెళ్లాలి. సాధ్యమైనంత వరకు నగదును వెంట తీసుకెళ్లక పోవడమే ఉత్తమం. ఏ ఆధారం లేని నగదును మాత్రమే జిల్లా గ్రీవెన్స్ కమిటీకి, ఐటీకి అప్పగించడం జరుగుతుంది. తనిఖీల్లో లభించిన నగదుకు సరైన ఆధారాలు చూపిస్తే వదిలేస్తారు.

– లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏసీపీ, మహేశ్వరం

'టిమ్స్' త్వరగా పూర్తిచేయండి

- ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు ఆరా
- పనుల్లో వేగం పెంచాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న క్రిస్టినా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం కొత్తపేటలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్, మహేశ్వరం మెడికల్ కాలేజీ పనులకు సంబంధించి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రెటరీ క్రిస్టినా చోంగ్తు కలెక్టర్ శశాంకతో కలిసి సమావేశం నిర్వహించారు. మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులతో చర్చించారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ పనులను పరిశీలించారు. హాస్పిటల్ నిర్మాణ పనులను ఎల్అండ్‌టీ ఇంజనీర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను సెక్రటరీ ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ వాణి, గచ్చిబౌలి టిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ విమల థామస్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్లు జానకి, విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

- గువ్వకుంట అన్యాక్రాంతంపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- ప్లాట్ల హద్దురాళ్లు, పార్కు నిర్మాణం కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: కుంట అన్యాక్రాంతంపై రెవెన్యూ యంత్రాంగం కదిలింది. 'కబ్జామయం.. చెరువు మాయం' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనం అధికారుల్లో చలనం పుట్టించింది. గువ్వకుంట అన్యాక్రాంతంపై కలెక్టర్ శశాంక ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇన్నాళ్లు అంటీముట్టనట్టుగా వ్యవహరించిన ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఉదయాన్నే కుంట వద్ద ప్రత్యక్షమయ్యారు. ప్లాట్ల హద్దురాళ్లను మొత్తం తొలగించారు. కట్టను ఆనుకుని ఓ వెంచర్ నిర్వాహకులు నిర్మించిన పార్కును తొలగించారు. కట్టను ఆనుకుని చేపడుతున్న మరో నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ కూల్చివేతల్లో ఇరిగేషన్ డీఈఈ ఉషారాణి, ఏఈఈ రజా తాఫ్సీన్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాసులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్లాట్ల హద్దురాళ్ల తొలగింపు



పెద్దమంగళారం రెవెన్యూలో మొక్క నాటుతున్న సుధారెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుధారెడ్డి

మొయినాబాద్: వాతావరణ కాలుష్యంలో భారతదేశం మూడో స్థానంలో ఉందని.. ఇది ఆందోళనకరమైన విషయమని.. దీన్ని అధిగమించాలంటే ప్రకృతి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుధారెడ్డి అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ ఫౌండేషన్, సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతి, భూమి ఏమీ ఆశించకుండా మనకు ఎన్నో ఇస్తాయని.. అందుకే వాటిని మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడటం, జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి, పర్యావరణాన్ని నాశనం చేయొద్దని.. బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తేనే అభివృద్ధి కాదని.. వాటితో పాటు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని రహదారులు, విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రులు, ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటుతామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే ప్రతి ఒక్కరూ ప్లాటులో పది శాతం స్థలంలో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలపై నిఘా

- జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- బ్యాంకర్లతో కలెక్టర్ శశాంక ప్రత్యేక సమావేశం
- ఆర్థిక లావాదేవీలపై ఆరా తీయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారత ఎన్నికల సంఘం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఈ నెల 16న వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఇది అమలులో ఉంటుందని, అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లాస్థాయి బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష రూపాయలకు పైగా లావాదేవీలు జరిపితే కచ్చితంగా వివరాలు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని పేర్కొన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి, క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్లను తనిఖీ చేయాలని వివరించారు. ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చుల వివరాలకు కొత్త ఖాతా తెరవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఎల్డీఎం కుసుమ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం అని, ఇప్పటికే ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కోవాలని, 18 ఏళ్లు నిండిన వారు విధిగా ఎపిక్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ ద్వారా అవగాహన చేపట్టాలని అన్నారు. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 5కే రన్ నిర్వహించాలని, వాల్ పోస్టర్స్ ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. గ్రేటర్ కమ్యూనిటీ రెసిడెన్షియల్ అసోసియేషన్ వారితో సమావేశాలు నిర్వహించి ఓటింగ్ శాతం పెంచాలన్నారు. మహిళా సంఘాలు, విద్యార్థుల ద్వారా వారి కుటుంబాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా స్వీప్ నోడల్ అధికారి శ్రీలత, డీపీఓ సురేష్ మోహన్, డీఈఓ సుశీందర్‌రావు, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఇంటర్మీడియెట్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

జంపింగ్‌లకే జై

- పారాచూట్ లీడర్లకే కాంగ్రెస్ పెద్దపీట
- చేవెళ్ల బరిలో గడ్డం రంజిత్‌రెడ్డి
- మల్కాజిగిరి నుంచి పట్నం సునీతారెడ్డి



రంజిత్‌రెడ్డి



సునీతారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కాంగ్రెస్ అధిష్టానం పారాచూట్‌లకే పెద్దపీట వేసింది. చేవెళ్లకు సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మల్కాజిగిరి స్థానానికి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్లను ఖరారు చేసింది. ఈ మేరకు గురువారం రాత్రి అభ్యర్థులను ప్రకటించింది. ఈ ముగ్గురూ ఇటీవలే కారు దిగి.. హస్తం గూటికి చేరినవారు కావడం గమనార్హం. ఇతర పార్టీల నుంచి కొత్తగా కాంగ్రెస్‌లో చేరిన వారికి ఎంపీ సీట్లు కేటాయించడంతో మొదటి నుంచీ పార్టీనే నమ్ముకున్న లీడర్లకు ఆశాభంగం తప్పలేదు. అధిష్టానం తీరుతో పార్టీ శ్రేణుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

కారు దిగి.. హస్తం గూటికి చేరి..

హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో కనీస ప్రాతినిధ్యం లేకపోవడంతో అధికార కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి మహానగర పరిధిలోని నాలుగింటిలో మూడు స్థానాలు కైవసం చేసుకునేందుకు వ్యూహ రచన చేశారు. ఇందులో భాగంగా ఇతర పార్టీల నుంచి చేరికలకు తెరలేపారు. దీంతో చేవెళ్ల టికెట్ ఆశించిన ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఆయన సతీమణి వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత సిట్టింగ్ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి కూడా ఇదే స్థానాన్ని ఆశిస్తూ.. కారు దిగి హస్తం గూటికి చేరారు. మరోవైపు సికింద్రాబాద్ టికెట్ ఆశించి జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆయన సతీమణి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి దంపతులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె భర్త మోతే శోభన్‌రెడ్డి సికింద్రాబాద్, మల్కాజిగిరిలోని ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయాలని భావించి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ.. ఆయనకు సైతం భంగపాటు తప్పలేదు.

ఆశలు.. అడియాసలై..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన ఆ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. మళ్లీ లోక్‌సభ బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి టికెట్ ఆశించారు. నాగర్‌కర్నూలు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ సీనియర్ లీడర్, సినీనటుడు అల్లు అర్జున్ మామ చంద్రారెడ్డి కూడా ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా మల్కాజిగిరి సీటును ఆశించారు. అనూహ్య పరిణామాల మధ్య అధిష్టానం వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి టికెట్ ఖరారు చేసింది. దీంతో ఇప్పటి వరకు ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన మైనంపల్లికి ఆశాభంగమే మిగిలింది.

పోరు రసవత్తరం..

చేవెళ్ల నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి మాజీ జెడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ఇటీవలే బీఆర్ఎస్‌ను వీడిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారే. ప్రస్తుత ఎన్నికల్లో ఈ ముగ్గురు పోటీ పడుతుండటంతో ఇక్కడ పోటీ రసవత్తరంగా మారనుంది.

ఎరువుల లెక్క పక్కా

- కృత్రిమ కొరతకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం దృష్టి
- అందుబాటులోకి ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్

షాబాద్: ఎరువుల తనిఖీ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. నిల్వల్లో తేడాలు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఫర్టిలైజర్ ఇన్‌వెంటరీ వెరిఫికేషన్ సిస్టం(ఫైవ్) పేరిట కొత్త యాప్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం అందుబాటులోకి తెచ్చింది. ఎరువుల కొరతకు చెక్ పెట్టడమే కాకుండా నిల్వలపై ఎప్పటికప్పుడు అధికారులు నిఘా ఉంచేందుకు ఇది తోడ్పడనుంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలను అధికారులు ఈ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా జిల్లాలో ప్రైవేట్, ఏపీసీఎస్‌లు, ఓడీసీఎంఎస్‌లకు సంబంధించినవి 290 ఫర్టిలైజర్ షాపులు ఉన్నాయి.

కొరత సృష్టిస్తున్నారు

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు రాయితీపై ఎరువులను అందిస్తోంది. రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో పారదర్శకతను మరింత పెంచేందుకు పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) విధానంలో రైతులకు ఎరువులు విక్రయిస్తున్నారు. ఈ విధానంలో రైతులు తమ ఆధార్‌కార్డు, పాస్‌బుక్ సమర్పించాల్సి ఉంటుంది. రైతులు ఆధార్‌కార్డులు, పాస్ పుస్తకాలు తీసుకురాకపోవడంతో ఎరువుల షాపుల యజమానులు పీఓఎస్ మిషన్లలో సమగ్రంగా వివరాలు నమోదు చేయడం లేదు. వాస్తవంగా షాపుల్లో యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు ఉండవు. కానీ, ఈ పాస్ మిషన్‌లో స్టాకు ఉన్నట్లు ఉంటుంది. దీంతో కచ్చితమైన నిల్వల వివరాలు తెలుసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిమించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

యాప్‌లో సమగ్ర వివరాలు

ఎరువులను అధికారులు ధ్రువీకరించడంతో పాటు నిల్వలు, విక్రయాలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనేది ఈ యాప్ ద్వారా జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ), డివిజన్ సహాయ సంచాలకులు (ఏడీఏ), మండల వ్యవసాయాధికారి (ఏఓ) తనిఖీలు నిర్వహిస్తున్నారు. అధికారులు ఆన్‌లైన్‌లో నిర్దేశించిన షాపునకు వెళ్లి యాప్ ఓపెన్ చేస్తే ఆ దుకాణంలో ఎరువుల వివరాలు లభిస్తాయి. ఈ పాస్ యంత్రంలో చూపించే నిల్వలతో సమానంగా స్టాక్ రిజిస్టర్, షాపులో గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండాలి. విక్రయించిన రైతుల వివరాలతోపాటు స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వాటిని ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా స్టాక్‌బుక్, నిల్వలను పరిశీలించి తేడా ఉన్నట్లు గమనిస్తే చర్యలు తీసుకోవచ్చు. సమగ్ర వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి చేరుతుండడంతో జిల్లాలో ఎరువుల నిల్వలు, అవసరమైన ఎరువుల వివరాలు తెలుసుకోవడం సులభతరం అవుతున్నది.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి (ఫైల్)

వారంలో రెండుసార్లు

మండల వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, వారానికి రెండుసార్లు 10 ఎరువుల షాపుల్లో తప్పకుండా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అలాగే, జిల్లా వ్యవసాయాధికారి కూడా నెలకు ఐదుసార్లు దుకాణాలను తనిఖీ చేయాలి.

మరింత పారదర్శకత



కొత్త యాప్ ద్వారా ఎరువుల విక్రయాల్లో మరింత పారదర్శకత పెరుగుతుంది. నిల్వలపై ప్రభుత్వం వద్ద సమాచారం ఉంటుంది. కృత్రిమ కొరతకు అవకాశం ఉండదు. దీంతో ఎరువుల కొరత అనే సమస్య ఉత్పన్నం కాదు.

– వెంకటేశం, ఏఓ, షాబాద్

నిల్వల్లో తేడా ఉంటే చర్యలు



ఎరువుల నిల్వల్లో తేడాలు లేకుండా ఉండేందుకు ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చింది. షాపుల్లో తనిఖీ చేసి తేడాలు ఉంటే ప్రత్యేక యాప్ ద్వారా గుర్తించవచ్చు. ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

చీటింగ్ కేసులో దంపతుల అరెస్ట్

మల్కాజిగిరి: ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థలను మోసం చేసిన కేసులో దంపతులను మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..మౌలాలి ప్రాంతానికి చెందిన దీకొండ శ్యామ్‌కుమార్, దాసరి రజిని అలియాస్ దీకొండ వర్షిణి దంపతులు గత కొంత కాలంగా వేరే గోల్డ్ లోన్ సంస్థంలో ఉన్న తమ బంగారాన్ని విడిపించి మీ వద్ద కుదవపెడతామని నమ్మించి పలు గోల్డ్ లోన్ సంస్థలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారు. ఇదే తరహాలో మల్కాజిగిరిలోని కెఎల్ఎం యాక్సివా ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌లో దాదాపు రూ. 14 లక్షలు కాజేశారు. కంపెనీ నిర్వాహకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన మల్కాజిగిరి పోలీసులు గురువారం మౌలాలిలో నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి కారు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.11 లక్షల నగదును సీజ్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. వీరిపై కీసర, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ కేసులు నమోదైనట్లు తెలిపారు.

మైసమ్మ సేవలో జెడ్పీ చైర్‌పర్సన్



మైసిగండి సన్నిధిలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మను గురువారం జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అనితారెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వీరయ్య తదితరులు ఉన్నారు.

నేడు పశుపోషణపై సదస్సు

ఏజీవర్సిటీ: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారత జాతీయ ఉత్పాదక మండల ఆధ్వర్యంలో నేడు సుస్థిర పాడి పశువుల ఉత్పాదకత సమగ్ర పశుపోషణ యాజమాన్య పద్ధతి అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక విస్తరణ విభాగం అధికారి సత్యనారాయణ తెలిపారు. వివిధ అంశాలపై లోతైన పరిశోధన, మేధోమథనం, ఉత్పాదకత పశు సంక్షేమం అనే అంశాలపై చర్చ కార్యక్రమాలు ఉంటాయన్నారు. (ఈఈఐ) విస్తరణ విద్యా సంస్థ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి అదార్ సిన్హా ఐసీఆర్ఓ డైరెక్టర్ డాక్టర్ రాజీవ్ రంజన్ విశ్వవిద్యాలయం అధికారులు పాల్గొంటారన్నారు.

వేలం పాటపై సందిగ్ధం!



మాల్ సంతలో పశువుల క్రయ, విక్రయాలు (ఫైల్)

- ముగుస్తున్న మాల్ పశువుల సంత నిర్వహణ గడువు
- ఎన్నికల సంఘం అభిప్రాయం కోరిన గ్రామ పంచాయతీ

యాచారం: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో యాచారం మండలంలోని మాల్ పశువుల సంత నిర్వహణ వేలం పాటపై సందిగ్ధం కొనసాగుతోంది. వేలం పాట నిర్వహించాలా.. వద్దా.. అనే అంశంపై స్పష్టత కోసం మాల్ గ్రామ పంచాయతీ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. ఈ సంత నిర్వహణకు ఏటా మార్చి 30 లోపు వేలం పాట నిర్వహించాల్సి ఉంటుంది. వేలం పాటలో వచ్చిన ఆదాయంతో సంత నిర్వహణతో పాటు గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తారు. వేలం పాటలో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పాల్గొంటారు. వేలంపాట గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయని అధికారులు ఎదురు చూస్తున్నారు.

మూడు జిల్లాల్లో క్రేజ్

మాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి మంగళవారం జరిగే పశువుల సంతకు రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎంతో క్రేజ్ ఉంది. మాల్‌లో జరిగే సంతకు మూడు జిల్లాల పరిధిలోని వందలాది గ్రామాల నుంచి రైతులు తమ పశువుల క్రయ, విక్రయాల కోసం వస్తారు. దీంతో వందలాది మంది మధ్యవర్తులు, చిరు వ్యాపారులు ఆదాయం పొందుతారు. ఈ మూడు జిల్లాలో పెళ్లిల్లు, శుభకార్యాలు ఏ గ్రామంలో జరిగిన మాంసం కోసం ఈ సంతకు వచ్చే గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి తీసుకెళ్తారు.

కార్లతో విద్యార్థుల హంగామా

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కౌన్సెలింగ్ ఇచ్చిన ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: వారంతా బీటెక్ విద్యార్థులు.. తాము చేసేదే కరెక్ట్ అనుకునే స్వభావం కలిగిన వయసు వాళ్లది. కళాశాలలో జరిగే ఫేర్‌వెల్ పార్టీకి కార్లతో ర్యాలీగా వెళ్లారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. గమనించిన పోలీసులు విద్యార్థులను అడ్డగించారు. వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. మంగళ్‌పల్లి, పోచారం గ్రామాల మధ్యనున్న సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ పార్టీకి 20 కార్లతో ర్యాలీగా సుమారు వంద మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చారు. హైదరాబాద్, నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని కొహెడ క్రాస్ రోడ్డు వద్ద ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతూ, సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్యలు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చారు. లైసెన్స్‌లు, అనుమతి లేకుండా ర్యాలీలు తీయడం, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి పొరపాట్లు మళ్లీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



బీటెక్ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ

ప్రత్యేక పాలనపై కలెక్టర్ సీరియస్

అధికారులంతా గ్రామాలకు వెళ్లాలని ఆదేశం



దండుమైలారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న తహసీల్దార్ సునీత

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: 'పడకేసిన ప్రత్యేక పాలన' అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. వేసవి కాలంలో అధికారులు గ్రామాలకు వెళ్లకుంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. వెంటనే గ్రామాలకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కోసం కలెక్టర్ ఎంపీడీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. తప్పకుండా ప్రత్యేకాధికారులు గ్రామాలకు వెళ్లేలా చూడాలన్నారు. పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి గ్రామాలకు వెళ్లకుంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం. ఎంపీడీఓ, తహసీల్దార్, ఏఈ, ఎంపీఓలతో పాటు ఇతర అధికారులు రోజు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. అలాగే డీఎల్‌పీఓ, ఎంపీడీఓలకు ఫోన్ చేసి గ్రామాలకు వెళ్లని ప్రత్యేకాధికారులకు మెమోలు జారీ చేయాలని స్పష్టం చేశారు. పంచాయతీ అధికారులు రోజు వారీగా గ్రామాల్లో ఉదయం 9 గంటలకు ఉండాలని హుకుం జారీ చేశారు. ఇదిలా ఉంటే ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రత్యేక అధికారులు గురువారం గ్రామాల్లో పర్యటించారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలు

పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: అక్రమార్కులు బఫర్‌జోన్‌లను సైతం వదలడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలో సర్వే నంబర్ 376లో బఫర్ జోన్‌లో రియల్టర్లు యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. మంఖాల్ వాగు నుంచి వరద నీరు బాగ్ మంఖాల్ చెరువు, తుక్కుగూడ గ్రామాల మీదుగా రావిర్యాల చెరువులోకి వెళ్తుంది. వాగులో నీరు నిర్మాణాలకు అడ్డు రాకూడదని రియల్టర్లు భారీ ఎత్తున గోడను నిర్మిస్తున్నారు. 100 ఫీట్ల వెడల్పుతో ఉన్న వాగు బఫర్ జోన్‌లో రిటైనింగ్ వాల్‌ను నిర్మించి నీటిని అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు. వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టి నిర్మాణాలకు సదరు రియల్టర్లు ఉపయోగిస్తున్నారు. వాగులో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బఫర్ జోన్ నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై శంషాబాద్ డివిజన్ ఇరిగేషన్ ఏఈ గోవింద్ స్పందిస్తూ.. మంఖాల్ వాగులో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తామన్నారు. అనుమతులు లేకుండా బఫర్ జోన్‌లో నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మంఖాల్ వాగు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణం

నాలాను ధ్వంసం చేసిన వ్యాపారులు

ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే బక్కని



గోడ కట్టిన ప్రాంతాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నో ఏళ్లుగా ఉన్న నాలాను ధ్వంసం చేసి తమకు అనుకూలంగా కల్వర్టును నిర్మించుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణ సమీపంలోని పాత జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్‌మార్ట్ ఎదురుగా ఉన్న నాలాను మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావసరాల కోసం ప్రభుత్వం నిర్మించిన నాలాలను ధ్వంసం చేసే అధికారం ప్రైవేట్ వ్యాపారులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. పురాతన నాలాను కూల్చి తమకు అనుకూలంగా అడ్డంగా గోడ నిర్మించడం ఏమిటన్నారు. నాలాను కూల్చివేస్తే నీటి ప్రవాహం ఎక్కడికి పోతుందని నేషనల్ మార్ట్ సిబ్బందిని అడిగారు. ప్రైవేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా కూల్చివేస్తే ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. నాలాను ధ్వంసం చేసిన ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సాయికుమార్



సాయికుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా మత్స్యకార సంఘం నాయకులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందని నూతనంగా నియమితులైన రాష్ట్ర ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అన్నారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన రంగారెడ్డి జిల్లా మత్స్యకార్మికుల విభాగం చైర్మన్ బాకారం మహేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మత్స్యకార్మికుల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల మత్స్యకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం



విజయ సంకేతం చూపుతున్న కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్

బండ్లగూడ: బండ్లగూడ మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది. మొత్తం 22 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో 16 మంది మేయర్ మహేందర్ గౌడ్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు. గురువారం రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మేయర్ మహేందర్ గౌడ్‌తో పాటు ఆయనకు మద్దతునిస్తున్న ఐదుగురు కార్పొరేటర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. మహేందర్ గౌడ్‌కు వ్యతిరేకంగా 14 మంది కార్పొరేటర్లు అవిశ్వాస ప్రతిపాదనను ధ్రువీకరిస్తూ తమ సమ్మతిని తెలిపారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లయింది.